క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

కంబాలచెరువు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన పెంపొందించడం కోసం ర్యాలీ నిర్వహించినట్లు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఆవాస ప్రాంతంలో శనివారం ర్యాలీ చేశారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జి బి.గిరిజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఎస్‌కేవీటీ పాఠశాల నుంచి కంబాల చెరువు కూడలి వరకూ సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రెడ్ క్రాస్ యూనిట్ కన్వీనర్ బీబీ విజయ కుమారి, జె.అపర్ణ, విజేత, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యుడు డాక్టర్ పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక కృష్ణానగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ వజ్రోత్సవ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

సమస్యలు పరిష్కరించాలి

ధవళేశ్వరం: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి లేఖ రాసినట్లు ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు వేతన సవరణ కమిటీ వేయాలని కోరారు.

నోట్ పుస్తకాల వితరణ

కంబాలచెరువు: స్థానిక వీరభద్రపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ), అమ్మఒడి సేవా తరంగిణి సంస్థల ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. జేసీఐ మెంటార్, ప్రముఖ టిడ్ లెన్స్ ఐటీ సొల్యూషన్స్, ఐ -గురుకుల్ అధినేత జేసీ రామ్ కుమార్ రామ్‌దేవ్ మాట్లాడుతూ తాను ఈ స్కూలులోనే చదువుకున్నానన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అమ్మఒడి సేవా తరంగిణి కార్యదర్శి శివస్వామి మాట్లాడుతూ మన దేశ గొప్పదనాన్ని వివరించారు. భారతీయ సంస్కృతిపై ప్రశ్నలు వేసి, సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా తరంగిణి కోశాధికారి నాగమణి, జేసీఐ సభ్యులు మోహన ప్రియ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీ పాల్గొన్నారు.

అలరించిన సంగీత కార్యక్రమం



కృష్ణకుమార్ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ భౌతికంగా దూరమైనా ఆయన గానం ఈనాటికీ సంగీత ప్రియులకు అమృతం పంచుతోందని వక్తలు కొనియాడారు. దానవాయిపేట పాండురంగస్వామి ఆలయంలోని సంగీత లహరి ఫంక్షన్ హాల్లో శనివారం రాత్రి స్థానిక బాలమురళీకృష్ణ జయంతి సంగీత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ సంగీత సభ వ్యవస్థాపక కార్యదర్శి సాగి శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారులు యనమండ్ర శ్రీనివాస శర్మ, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి పాల్గొన్నారు. మంగళంపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య సాయంకాల దినపత్రిక సంపాదకులు వీవీఎస్ కృష్ణకుమార్‌ను మురళీ మనోజ్ఞ వాక్ సుధాకర్ బిరుదు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గాత్ర కచేరి శ్రోతలను అలరించింది. అనంతరం కళాకారులు బి.రవికుమార్ (గాత్రం), సరస్వతుల పార్థివ (వయలిన్), ఏ.కామేష్ (మృదంగం), ఆర్.బాలదినకరన్ (ఘటం)లను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి దినవాహి బాపిరాజు, సంస్థ అధ్యక్షుడు వి.శేషగిరి వరప్రసాద్, ఉపాధ్యక్షులు వాడ్రేవు మల్లపరాజు పాల్గొన్నారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి

రాజమహేంద్రవరం రూరల్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం తొర్రేడు బీసీ కాలనీలోని పార్కులో ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ రూరల్ అసెంబ్లీ కో కన్వీనర్ యానాపు ఏసు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఒక చెట్టు – అమ్మ కోసం (ఏక్ పేడ్ – మా కే నామ్) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

జై జగన్నాథ..

- నేడు రథయాత్ర
- శ్యామలా నగర్ నుంచి ఇస్కాన్ వరకూ నిర్వహణ
- పూర్తయిన ఏర్పాట్లు

ఇస్కాన్ మందిరం



సీటీఆర్ఐ: జగన్నాథస్వామి రథయాత్రకు సర్వం సిద్ధమైంది. భక్తులకు దర్శన భాగ్యం కల్పించడానికి భగవంతుడు పుర వీధులలో ఊరేగనున్నాడు. ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు శ్యామలా నగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభమవుతుంది. ఏటా పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అదే విధంగా ఇస్కాన్ మందిరంలో కూడా జగన్నాథ స్వామి కొలువై ఉండడంతో ఇక్కడ కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారు. కానీ జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్టును ఉంచి ఊరేగించడం ప్రత్యేకత. మందిరానికి రాలేని భక్తుల కోసం స్వామి వారే స్వయంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ఉద్దేశం. కీర్తనలు, భజనల నడుమ జగన్నాథ, బలదేవ, సుభద్రల విగ్రహాలను రథంలో ఉంచి ఊరేగింపు నిర్వహిస్తారు.

రథయాత్ర సాగుతుందిలా..

శ్యామలా సెంటర్ రామాలయం నుంచి మొదలైన రథయాత్ర గోరక్షణ పేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా ఇస్కాన్‌కు చేరుకుంటుంది. రథయాత్రలో భాగంగా తరలివచ్చిన భగవంతుని దర్శించుకుని భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. గతేడాది కంబాల చెరువు నుంచి ప్రారంభించగా, ఈ సారి శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి మొదలు కానుంది. రథయాత్ర ముగిసిన తర్వాత జగన్నాథస్వామి లీలలపై ప్రవచనం, 56 రకాల భోగ నైవేద్యం, దీప హారతులు, అనంతరం ప్రసాద వితరణ జరుగుతాయి.



జగన్నాథుడు, బలదేవుడు, సుభద్రల విగ్రహాలు

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్ ప్రశాంతిని కలిసిన షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: కలెక్టర్ ప్రశాంతిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి శనివారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

యోగాతో గర్భిణులకు అనేక ప్రయోజనాలు



మాట్లాడుతున్న డాక్టర్ చందన పర్వత వర్ధిని

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గర్భిణులు యోగా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని మాగ్న మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వత వర్ధిని అన్నారు. ఆ హాస్పిటల్‌లో శనివారం యోగా ట్రైనర్ గారపాటి ప్రణవి ఆధ్వర్యంలో గర్భిణులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పర్వత వర్ధిని మాట్లాడుతూ యోగాసనాలు వేయడం వల్ల పెల్విక్ ఫ్లోర్, పొత్తికడుపు కండరాలు బలోపేతం అవుతాయన్నారు. తద్వారా సులభ ప్రసవానికి మార్గం సుగమవుతుందన్నారు. ప్రసవ సమయంలో తలెత్తే ఒత్తిడి, ఆందోళన కూడా తగ్గుతుందన్నారు. పిండం ఎదుగుదల కూడా బాగుంటుందన్నారు. అలాగే శరీరాన్ని ఆరోగ్యంగా, మనసును ప్రశాంతగా ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇతర వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



వ్యాక్సినేషన్‌లో పాల్గొన్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పెంపుడు జంతువుల ఆరోగ్యం కోసం, వాటి నుంచి మనకు వ్యాధులు సోకకుండా ఉండేందుకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఏరియా పశువైద్యశాలలో రేబిస్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పశువైద్యశాఖ, ఆరోగ్యశాఖ, నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏరియా పశువైద్యశాలలో ఏర్పాటు వ్యాక్సినేషన్ శిబిరంలో 500 జంతువులకు, 1500 మంది జంతువుల యజమానులు, నగరపాలక సంస్థ సిబ్బంది, పశువైద్యశాఖ సిబ్బందికి యాంటీరేబిస్ టీకాలు వేసినట్టు తెలిపారు. గతంలో జంతువులకు మాత్రమే టీకాలు వేయడం జరిగిందని, ఈ ఏడాది నుంచి జంతువులతో పాటు వాటి యజమానులకు వ్యాక్సినేషన్ వేసినట్టు తెలిపారు. జంతువుల వల్ల కలిగే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లు పంపిణీ చేశారు. అలాగే వ్యాక్సిన్ వేయించుకున్న జంతువుల యజమానులకు జైన్ సేవాసమితి ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ పశువైద్యశాఖ ఉపసంచాలకులు డాక్టర్ మక్కెన వెంకటేశ్వరరావు, ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.సత్యనారాయణ, పశువైద్యులు జి.లోకేష్, యోగానంద్, ప్రసన్న కుమార్, ఆరోగ్యశాఖ తరఫున రాజీవ్, ఎపిడమాలజిస్ట్ సుధీర్, స్థానిక వైద్యులు, జూనియర్ పశువైద్యులు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ గురుబాబు తదితరులు



బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మహోదయ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పేదల అభ్యున్నతికి మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని ఏపీ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఏ.గురుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డివిజనల్ ఇంజినీర్లు కె.విజయ కుమార్, శ్రీలత, ఏఏవో బాలసుబ్రహ్మణ్యం, జేఏవో కేవీ రమణ, ఏడీఈ విద్యాసాగర్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

కడియం: వేమగిరి వేమారామంలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మహోదయ ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి దంగేటి సత్తిబాబు, రామచంద్రమూర్తి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

జిల్లాలో పంటల అభివృద్ధికి చర్యలు



ఎంపీ పురంధేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు శనివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో ఆమె కలిసి, జిల్లాలో వ్యవసాయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లాలో వివిధ పంటల సాగు వివరాలు, సాగు పరిస్థితులను తెలియజేశారు. రాజమహేంద్రవరం రూరల్ వ్యవసాయ అధికారి ఏ.భీమరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు వేణుమాధవ్, పీటర్ తదితరులు ఉన్నారు.

ట్రోఫీ విజేత ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్

రాజమహేంద్రవరం రూరల్: సీఐఎస్‌సీఈ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రీజియన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్ ట్రోఫీని రాజమహేంద్రవరంలోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ కైవసం చేసుకుంది. ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో మూడు రోజులుగా నిర్వహించిన ఈ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ చైర్ పర్సన్ వై.విజయ రవిబాబు మాట్లాడుతూ క్రీడలలో గెలుపు, ఓటములు సహజమన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, బహుమతులను ప్రదానం చేశారు. టోర్నమెంట్ నిర్వాహకులను మెమెంటోలతో సత్కరించినట్లు ప్రిన్సిపాల్ శేషగిరిధర్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి అండర్ 14, 17 ,19 కేటగిరీలలోని అగ్రశ్రేణి క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- అండర్ – 14 బాలుర విభాగంలో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (రాజమహేంద్రవరం) ప్రథమ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట) ద్వితీయ, జాన్సన్ గ్రామర్ స్కూల్ (మల్లాపూర్) తృతీయ, టింపనీ స్కూల్ (విశాఖపట్నం) నాలుగో స్థానాలు సాధించాయి.
- అండర్ – 14 బాలికల విభాగంలో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (హైదరాబాద్), టింపనీ స్కూల్ (విశాఖపట్నం), ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (రాజమహేంద్రవరం), సెయింట్ జోసఫ్ స్కూల్ (మలక్‌పేట్) వరస స్థానాలలో నిలిచాయి.
- అండర్ – 17 బాలుర విభాగంలో సెయింటాన్స్ స్కూల్ (చీరాల), జాన్సన్ గ్రామర్ స్కూల్ (మల్లాపూర్), హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట), రమాదేవి పబ్లిక్ స్కూల్(హయాత్ నగర్) ప్రతిభ చూపాయి.
- అండర్ – 17 బాలికల విభాగంలో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (రాజమహేంద్రవరం), టింపనీ స్కూల్ (విశాఖపట్నం), ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (హైదరాబాద్), జాన్సన్ గ్రామర్ స్కూల్ (కుంట్లూరు) వరస స్థానాలు సాధించాయి.
- అండర్ – 19 బాలుర విభాగంలో ఎస్ఏఎస్ఆర్ బాయ్స్ స్కూల్ (గచ్చిబౌలి), షేర్‌వుడ్ పబ్లిక్ స్కూల్, జాన్సన్ గ్రామర్ స్కూల్ (మల్లాపూర్), ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్(రాజమహేంద్రవరం) సత్తా చాటాయి.
- అండర్ – 19 బాలికల విభాగంలో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ (రాజమహేంద్రవరం) ప్రథమ, జాన్సన్ గ్రామర్ స్కూల్ (మల్లాపూర్) ద్వితీయ స్థానాలలో నిలిచాయి.



విజేతలతో ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ చైర్‌పర్సన్ విజయ రవిబాబు

నేడు చిత్రలేఖనం పోటీలు

కంబాలచెరువు: అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని గోదావరి బాలోత్సవం, చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్, మనం ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకురాలు తులసీ ఈ విషయాన్ని శనివారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకూ రివర్ బే సమీపంలోని గోదావరి గట్టుపై ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ హాలులో పోటీలు జరుగుతాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో 2, 3, 4 తరగతుల విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు చిత్రం (పొట్రైట్), జూనియర్స్ విభాగంలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు అల్లూరి ఫుల్ చిత్రం, సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అల్లూరి పాత్ర, పోరాట ఘట్టాలు అంశంపై పోటీలు జరుగుతాయన్నారు. డ్రాయింగ్ షీట్ మాత్రమే ఇస్తామని, మిగతా మెటీరియల్ విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. దీనికి ప్రవేశం ఉచితమని, విజేతలకు సాయంత్రం 4 గంటలకు బహుమతులు అందజేస్తామన్నారు.

సత్యసాయి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి

రాజమహేంద్రవరం రూరల్: సత్యసాయిబాబా శతజయంతిని అందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పిలుపు నిచ్చారు. రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులంలో శనివారం రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. పదాధికారులు బాధ్యతతో సంస్థల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అఖిల భారత సమన్వయకర్త ఎస్.కోటేశ్వరరావు మాట్లాడుతూ నవసూత్ర నియమావళిని పాటించి ఆధ్యాత్మికంగా, వ్యక్తిగత సాధన చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్య, వైద్య, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు గ్రామ గ్రామానా ఎలా నిర్వహించాలో వివరించారు. సమావేశంలో సౌత్ జోన్ సమన్వయకర్త ముకుందన్, జాతీయ మహిళా విద్యావిభాగ సమన్వయకర్త శశిబాల, పి.గోపికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముందుగా బాబా నివాస ప్రాంతం నుంచి గురుకులం విద్యార్థుల వేద పఠనంతో బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. అఖిల భారత అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రశాంతి పతాకను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి, సమావేశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సేవా సమన్వయకర్త కొమరగిరి శ్యామ్ ప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యామసుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య పాల్గొన్నారు.



సత్యసాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

కంబాలచెరువు: ఖైదీల ఆరోగ్య భద్రతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని రాజమహేంద్రవరం కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. ఖైదీల నేత్ర పరీక్షలకు సంబంధించి రెండో దశ శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఖైదీలకు కళ్లజోళ్లు సమకూర్చడం కోసం పరమహంస యోగానంద నేత్రాలయ ట్రస్టుకు రూ.25 వేలు అందించిన ఆమెన్ ట్రస్ట్ ప్రతినిధులు ఇవాంజిలిన్, అశోక్‌లను అభినందించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ జైళ్లలో అందిస్తున్న సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసిక పరివర్తన చెంది, విడుదలైన తర్వాత కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడాలన్నారు. పరీక్షల అనంతరం కంటి లోపాలున్న ఖైదీలకు మందులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బి.రత్నంరాజు, జైలర్లు ఆర్.శ్రీనివాసరావు, కేవీ రామారావు, సీహెచ్ రమేష్, సురేష్ కుమార్, వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం కో ఆర్డినేటర్ ఎస్.చంటిబాబు, డాక్టర్ కోమల, సోషల్ ఇంక్యుబేషన్ సభ్యులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ రాహుల్

సామాజిక తనిఖీ ప్రజావేదిక

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేద్దామన్నారు. ఏపీవో నాగేష వేణి మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకూ మండలంలో జరిగిన 1,098 పనులకు సంబంధించి కూలీల చెల్లింపులు రూ.7.52 కోట్లు, మెటీరియల్‌కు రూ.94.86 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. అనంతరం గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ వివరాలు వివరించారు. ఐదు గ్రామాల్లో మస్తర్లలో కొట్టివేతలు, దిద్దివేతలు, కొలతల్లో తేడాలు ఉండటంతో రూ.52 వేలు జరిమానా విధించారు. వీటిని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చెల్లించాల్సి ఉంది. కార్యక్రమంలో డ్వామా పీటీ ఎ.ముఖలింగం, ఏపీడీ బొల్లిశెట్టి రాంప్రసాద్, అంబుడ్స్‌మెన్ షేక్ ఖాదర్ బాషా, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం రాఘవపురానికి చెందిన పులపర్తి పూర్ణ అంజలీదేవి (28) రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై ఆనంద కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయంలో అప్పులు పెరిగిపోవడంతో భర్తతో ఆమెకు వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అంజలీదేవి శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను వెంటనే స్థానికుల సహాయంతో రాజమహేంద్రవరంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

ఎరుపెక్కిన గోదారమ్మ



పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం నీలిరంగు జలాలతో గోదావరి



వరద నీటితో శనివారం ఎరుపెక్కిందిలా..

రాజమహేంద్రవరం సిటీ: నిన్నటి వరకూ నీలిరంగు జలాలతో కనిపించిన గోదావరి ఎర్ర బారింది. పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీలిరంగు గోదావరి కాస్త ఎర్రగా మారింది. ఏటా జూన్‌లో వరద నీటి కారణంగా గోదావరి నీరు ఎర్రగా మారడం ఆనవాయితీ. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో జూలైలో ఈ విధంగా కనిపించింది. ఎరుపెక్కిన గోదావరిని చూసేందుకు శనివారం పుష్కర ఘాట్‌కు పెద్దసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.